విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

• అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

మానవపాడులో సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయుడు

మానవపాడు, డిసెంబర్ 12 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొనాలని అప్పుడే ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. క్రీడల్లో మంచిగా రాణిస్తే మంచి గుర్తింపుతోపాటు మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, జగన్, మురళీధర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకట్రాముడు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై తిమ్మప్పస్వామి

మల్దకల్‌లో మయూర వాహనంపై ఊరేగుతున్న తిమ్మప్ప స్వామి వారు

మల్దకల్, డిసెంబర్ 12 : ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి బిందె సేవా, బలిహరణం, ప్రత్యేక పూజలతో నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మి, భూదేవి సమేత వేంకటేశుడి ఉత్సవ విగ్రహాలను మయూర వాహనంపై గ్రామంలోని దశమికట్ట వద్దకు ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మంటపంలో ఉడిపి పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థుల శ్రీపాదుల వారి ఆధ్వర్యంలో మూల రాములుకు సంస్థాన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, మధ్వాచారి, మధుసూదనాచారి, రమేశాచారి, రవిచారి, బాబురావు, అరవిందరావు, గడ్డ కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, పద్మారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోనే మంచి ఫలితాలు

• జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ప్రియాంక

గట్టు, డిసెంబర్ 12 : నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు మెరుగైన విద్యనందించినప్పుడు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ప్రియాంక అన్నారు. ఆమె మండలంలోని మాచర్ల, బోయలగూడెం పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాణ్యమైన సరుకులతోనే ఆహార పదార్థాలను వండాలని, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. 9,10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించడానికి మెళకువలను విద్యార్థులకు సూచించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

అయిజ, డిసెంబర్ 12 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. గురువారం అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని 28 పంచాయతీల్లో అధికారులు సర్వే చేపట్టారు. యాప్‌లో ప్రభుత్వం సూచించిన అంశాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీవో వెంకటయ్య, మున్సిపల్ మేనేజర్ అశోక్‌కుమార్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

108 మంజూరు

ఇటిక్యాల, డిసెంబర్ 12 : ఇటిక్యాల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అత్యవస సేవల కోసం వినియోగించే 108 వాహనం మంజూరైనట్లు మండల వైద్యాధికారి రాధిక తెలిపారు. పీహెచ్‌సీలో గురువారం 108 వాహనానికి ఆమె పూజలు చేసి సేవలను ప్రారంభించారు. ఈ వాహనము ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లో సేవలు వినియోగించుకోవడానికి ఏర్పాటు చేసినట్లు జరిగిందన్నారు.

జిల్లా డిజిటల్ అధికారుల సంఘం ఎన్నిక

వనపర్తి టౌన్, డిసెంబర్ 12: వనపర్తి జిల్లా డిజిటల్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లాకేంద్రంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరప్రసాదరావు, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్, గబ్బార్, మల్లేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా శ్వేత, కార్యదర్శిగా సురేశ్, సంయుక్త కార్యదర్శిగా దేవరాజ్, ప్రభాకర్, సాయినాథ్‌రెడ్డి, కవిత, మహిళా సంయుక్త కార్యదర్శిగా రాధారెడ్డి, కోశాధికారిగా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా రాకేశ్, సంస్కృతిక కార్యదర్శిగా భోజలక్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా ఉమేశ్‌లతోపాటు కమిటీ సభ్యులుగా సుధాకర్, శ్యాం, విజయకుమార్, స్వాతిని ఎన్నుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అమరచింత, డిసెంబర్ 12 : గ్రామాల్లో నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయని అందుకని గ్రామస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఎస్సై సురేశ్ పేర్కొన్నారు. మండలంలోని ఈర్లది న్నెలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆసిరెడ్డి, వెంకట్‌రెడ్డి పలువురు గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పెబ్బేరు, డిసెంబర్ 12: పెబ్బేరులో సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. స్థానిక జూరాల క్రీడా మైదానంలో జరిగిన ముగింపు సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, మార్కెట్ చైర్‌పర్సన్ ప్రమోదిని గెలుపొందిన వారికి షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.

NT-338976-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

• కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, డిసెంబర్ 12 : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన జిల్లా యాంటీ ర్యాగింగ్ కమిటీ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా జూనియర్లను, తోటి వారిని వేధించడం ర్యాగింగ్ కిందికి వస్తుందని అటువంటి చర్యలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. వైద్య వృత్తికి మంచి గౌరవం ఉంటుందని, ప్రభుత్వ వైద్య విద్యార్థుల కోసం ఎంతో వెచ్చిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు గురైనట్లయితే వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైతే 14416 టెలిమానస్ హెల్ప్ లైన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడి చట్టం ముందు దోషులుగా నిలవవద్దని, గంజాయి అలవాటు పడవద్దని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా మెడికల్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సునందిని మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్ కమిటీ యాక్టివ్‌గా ఉందని, ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు గురైతే వెంటనే ఫిర్యాదుతో పాటు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ చాంబర్‌లో కూడా ఫిర్యాదుల బాక్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణను వేగవంతం చేయాలి

జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల విస్తరణ పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి రోడ్డు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పెండింగ్‌లో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కావాల్సిన ఏర్పాట్లు, కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణం తదితర అంశాలను పరిశీలించారు. అదేవిధంగా చింతల హనుమాన్ ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ దేశ్యానాయక్, డీఈ సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

14న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంతో ఈనెల 14న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లలో కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని, విద్యార్థులు తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలని చెప్పారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు పౌష్టికాహారంపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. తరగతుల వారీగా విద్యార్థుల్లో మానసిక సమస్యలను గుర్తించి నిపుణులైన వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. అనుక్షణం ధైర్యం నింపుతూ మానసికంగా, ఆరోగ్యంగా ఉండేవిధంగా చూడాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

17 నుంచి జిల్లా స్థాయి క్రీడాపోటీలు

ఈనెల 17వ తేదీ నుంచి జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లాస్థాయిలో అన్ని రకాల క్రీడా పోటీలకు ఏర్పాటు చేయాలని, 17, 18, 19 తేదీల్లో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో క్రీడలు ఉంటాయని, పీఈటీలను కేటాయించాలని ఆయన ఆదేశించారు. అందుబాటులో వైద్య సదుపాయాలు ఉండాలని సూచించారు. సమావేశాల్లో జెడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్, వైద్యా ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుబ్రమణ్యం, ఎస్‌ఈ శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రరావు, రాజేశ్‌రెడ్డి, వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

• కలెక్టర్ సంతోష్

గద్వాల, డిసెంబర్ 12: గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఈనెల 15,16తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రూప్-2 పరీక్షలను 15,16 తేదీల్లో రెండు రోజులపాటు నాలుగు దఫాలుగా ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 5:30 గంటల వరకు రెండు సెషన్లలో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న ఉదయం పేపర్-1 జనరల్‌స్టడీస్ అండ్ జనరల్‌ఎబిలిటీస్, మధ్యాహ్నం పేపర్-2 హిస్టరీ, పాలిటి అండ్ సొసైటీ డిసెంబర్16న ఉదయం పేపర్-3ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్, మధ్యాహ్నం పేపర్-4 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యం అయిన వారికి ఎట్టి పరిస్థితుల్లో హాల్లోకి అనుమతించబడదని చెప్పారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 8,722మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 25మంది సీఎస్‌లు, 25మంది డీవోలు, 5మంది రూట్ అధికారులు, ఐదుగురు జాయింట్ రూట్ అధికారులు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 26మంది అబ్జర్వర్లు,74 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా పేపర్లు, ఓఎంఆర్ షీట్‌లను ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్షా కేంద్రాలకు తరలించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒక ఒరిజినల్ ఐడీ కార్డుతో కేంద్రానికి వెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, రీజినల్ కోఆర్డినేటర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రత పటిష్టంగా ఉండాలి

గద్వాల, డిసెంబర్12 : ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని గోదాంలో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ గురువారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిమూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగా ఈ తనిఖీ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈవీఎంలు భద్ర పర్చిన స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూం భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ మల్లికార్జున ఎన్నికల విభాగ అధికారి కరుణాకర్, సురేశ్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

మాజీ ఎమ్మెల్యే ఆలను విమర్శించే హక్కు లేదు

• కొత్తకోట మాజీ ఎంపీపీ గుంత మౌనిక

మదనాపురం, డిసెంబర్ 12 : దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని కొత్తకోట మాజీ ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల వల్లనే 10ఏండ్లలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కనిమెట్ట-పాత జంగమాయపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన లేకుండా ఎన్నో ఏండ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయిన ఆయన గత ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయించారన్నారు. అదేవిధంగా పామాపురం-వీరరాఘవాపూర్ గ్రామాల మధ్యన వంతెన నిర్మాణం, అప్పరాల-తిప్పడంపల్లి గ్రామాల మధ్యన వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారని గుర్తు చేశారు. తండాలకు, మారుమూల గ్రామాలకు సైతం బీటీ, సీసీ రోడ్లు వేసి రవాణ సౌకర్యం కల్పించిన ఘనత ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే దక్కిందన్నారు. నియోజక వర్గంలో 32 చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయడంతో మండు వేసవిలో కూడా మత్తళ్లు దుంకినవని ఇదంతా కాంగ్రెస్ నాయకులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. ఇంత అభివృద్ధి చేసిన తమ నాయకుడిని విమర్శించడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, డిసెంబర్ 12 : జిల్లా వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. అర్బన్ ఏరియాలో వైద్యాధికారులు ఎంబీబీఎస్, ఎంబీబీఎస్ ఆయుష్ 2 పోస్టులు, రూరల్ ఏరియాలో 4 పోస్టులు ఉన్నాయని అందులో ఇద్దరు వైద్యులు, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అర్హత ఉన్నవారు అర్హులని, అభ్యర్థులు 18 నుంచి 44 ఏండ్ల వయస్సు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేండ్ల పాటు సడలింపు ఉందని, అంగవైకల్యం కలిగిన వారికి 10 ఏండ్లపాటు సడలింపు ఉందన్నారు. ఎంబీబీఎస్ ఆయుష్‌కు వేతనం రూ.40వేలు, స్టాఫ్ నర్సుకురూ.29,900 ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో జిరాక్స్ సెట్‌ను జతచేయాల్సి ఉంటుందన్నారు. జనరల్ కేటగిరి అభ్యర్థులు రూ.500, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు రూ.300 డీడీని జిల్లా వైద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభ్యర్థుల జాబితా విడుదల

వనపర్తి టౌన్, డిసెంబర్ 12 : వనపర్తి జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తుల చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశామని డీఈవో అబ్దుల్ గని తెలిపారు. మెరిట్ లిస్ట్‌ను de-oweebly.com వెబ్‌సైట్‌లో, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యర్థులు మీ వివరాలను చూసుకొని మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో రాత పూర్వకంగా 16వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. అకౌంటెంట్ మూడు పోస్టులకు గాను 145 దరఖాస్తులు, ఏఎన్ఎం 4 పోస్టులకు గాను 167 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఖిల్లాఘణపురం డిసెంబర్ 12: చెరువులో దూకి మహిళ ఆత్మహత్య పాల్పడిన ఘటన మండలంలోని మానాజీపేటలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన తలారి కాశమ్మ (68) తరుచుగా కల్లు తాగేది. దీంతో కుటుంబంలో ఎప్పుడైనా గొడవలు జరిగితే ఎక్కడైనా పడి చనిపోతా అంటూ ఉండేది. 12వ తేదీన గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో తన కుమారుడు శ్రీను కల్లు తాగొద్దని మందలించడంతో మనస్తాపం చెంది కాశమ్మ క్షణికావేశంలో గ్రామంలోని పెద్ద చెరువులో దూకి నీటిలో మునిగిపోయి మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్టులను పీజేపీ కాలనీలోనే నిర్మించాలి

గద్వాల అర్బన్, డిసెంబర్ 12 : కోర్టు సముదాయన్ని పీజేపీ కాలనీలోనే నిర్మించాలని సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుడు మోహన్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న పోరాటానికి గురువారం సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు మద్దతు తెలియజేస్తూ లేఖ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టరేట్ వెనుక భాగంలో మిగిలి ఉన్న 20ఎకరాల భూమిలో జిల్లా న్యాయస్థాన సముదాయన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్కడ నిర్మిస్తే కక్షిదారులు, న్యాయవాదులు, అందరికీ సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

బ్యాంక్ పేరు మార్పు

వడ్డేపల్లి, డిసెంబర్ 12 : జనవరి 1వ తేదీ నుంచి ఏపీజీవీబీని టీజీవీబీగా మార్చనున్నట్లు ఆ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ క్రాంతికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఖాతాదారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవలతోపాటు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ఐఎఫ్ వంటి పలు రకాల స్కీముల గురించి అవగాహన కల్పించారు.

నిందితుడిని శిక్షించాలి

మల్దకల్, డిసెంబర్ 12 : మండలంలోని మద్దెలబండ గ్రామానికి చెందిన పవిత్ర మూడురోజుల కిందట ఉరేసుకొని మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు నాయుడు గ్రామానికి చేరుకొని మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర మృతికి కారణమైన భర్తను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతల విషయంలో పూర్తిగా ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేశ్, శేఖర్ నాయుడు, తిరుమలేశ్, సామేలు, రాముడు, హనుమన్న, నూర్‌పాషా, ఆంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు..



మద్దెలబండలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బాసు హన్మంతు నాయుడు

వరి కొయ్యలను కాల్చొద్దు

• డీఏవో సక్రియానాయక్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో

గద్వాల, డిసెంబర్ 12 : రైతులు వరి కోతలు కోసిన తర్వాత పొలాల్లో ఉన్న వరి కొయ్యలను కాల్చవద్దని డీఏవో సక్రియానాయక్ సూచించారు. గద్వాల మండల వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని గ్రామాలైన అనంతపురం, గుర్రంగడ్డ, బసాపురం గ్రామాలను ఏఈవో భాస్కర్‌తో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు వానకాలంలో వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలు, గడ్డిని రైతులు కాల్చకుండా వాటిని భూమిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుందని, భూమిలో సేంద్రియ కార్బనం పెరుగు తుందన్నారు. కొయ్యలను కాల్చడం ద్వారా భూమిలో ఉండే సూక్ష్మజీవులు నశించి పోతాయన్నారు. దీంతో భూమిలోని తేమ శాతం ఆవిరై తగ్గిపో తుందన్నారు. రైతులు పంట కోసిన తర్వాత నీళ్లు వదిలి గడ్డితో కలియదున్ని ఎకరాకు 50కిలోల సూపర్ పాస్ఫ్ చల్లి వరి నాటు కుంటే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ రైతుల ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు.

గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, డిసెంబర్ 12 : వానకాలం వరి సాగుచేసిన రైతులు వరి కోత తర్వాత పొలంలో ఉన్నటువంటి వరి కొయ్యలను తగుల బెట్టవద్దని ఏవో కరుణశ్రీ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల భూమిలో ఉండే పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. అధిక వేడిమి వల్ల భూమిలో ఉండి పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు, మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. భూమికి ఎరువుగా మారే పంట యొక్క అవశేషాలు కాలి పోతాయని, దీనివలన దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుందన్నారు. అందుకని రైతులు వరి కొయ్యలను తగుల బెట్టకుండా మడిలో కలియదున్నాలన్నారు. దున్నే ముందు ఎకరాకు 100 కేజీల సూపర్ చల్లుకొని దున్నితే వరి కొయ్యలు 20 రోజుల్లో కుళ్లి పోయి పైరుకు మంచి ఎరువుగా మారిడం వలన అధిక పంట దిగుబడి వస్తుందన్నారు.

కనులపండువగా విగ్రహాల ఊరేగింపు

ఆత్మకూరు, డిసెంబర్ 12 : పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గురువారం విగ్రహాల ఊరేగింపు ప్రారంభం కాగా పట్టణ పురవీధుల గుండా కనుల పండుగగా సాగింది. విద్యార్థులు కోలాటం, భక్తిపారవశ్య నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు. మాలాధారణ స్వాములు భక్తినీరాజనాలతో పునీతులయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకోగానే గణపతి పుణ్యాహవాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, పంచగవ్య మేళన ప్రాసనం, ధ్వజారోహణం, నవగ్రహ సర్వతో భద్ర మండలం, యోగిని వాస్తు క్షేత్ర పాలక మండప ఆరాధనలు, మహా నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణలు జరిగాయి. అంతకు ముందు శాశ్వత వ్యవస్థాపక ధర్మకర్తలు మొగిళి శ్రీధర్ గౌడ్ దంపతులు, గాడి లక్ష్మీనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిహర పుత్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు, గురుస్వాములు, మాలాధారణ స్వాములు, రాజకీయ, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వేడుకగా సాగుతున్న విగ్రహాల ఊరేగింపు

ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి

• జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో ఎర్ర అంజయ్య

వనపర్తి టౌన్, డిసెంబర్ 12 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చక్కని ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య అన్నారు. గురువారం ఆయా సబ్జెక్టుల అధ్యాపకులతో కొనసాగుతున్న సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ రోజుకు మూడు సబ్జెక్టుల చొప్పున నాలుగు రోజులు సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రూప్ నుంచి రోజుకు ఒక్కరు చొప్పున హాజరవుతారని చెప్పారు. సమావేశంలో త్వరితగతిన సిలబస్ పూర్తిచేయడం, స్టడీ అవర్స్ నిర్వహించడం, పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సమాయత్తం చేసి జిల్లా రిజల్ట్స్‌ను పెంచాలని చెప్పారు. జిల్లాలోని ఒకే సబ్జెక్టులోని ఒకే సబ్జెక్టుకు సంబంధించిన అధ్యాపకులందరూ ఒకే దగ్గర చేరి ముఖ్యమైన ప్రశ్నల పైన ప్రశ్నల బ్యాంక్‌ను తయారుచేసి విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ రెడ్డి ఖిల్లా ఘణపురం ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీ గుర్తుందా సీఎం : బీజేపీ

గద్వాలటౌన్, డిసెంబర్ 12 : గతేడాది ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరానికి వెళ్లి మేము అధికారంలోకి రాగానే ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ గుర్తుందా సీఎం అంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డిప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని స్మృతి వనం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతుంది. గురువారం సమ్మె శిబిరానికి చేరుకుని ఉద్యోగులకు బీజేపీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో సమానంగా పనిచేయించుకుంటున్న హక్కులను కల్పించడంలో వ్యత్యాసం చూపుతుందని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్, డిసెంబర్12: అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు రాధ, శారద అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ తదితర ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.